ఊరిపేరు

ఆ రాజ్యమును పాలిస్తూవున్న మహారాజు కీర్తి దేశదేశములా వ్యాపించినది. ఎక్కడలేని పండితులూ, కవులూ, యాచకులూ, రాయబారులూ ఆ మహారాజు దర్శనం కోసము వస్తూ పోతూ ఉండేవారు. కవు లీ మహారాజును భోజు డన్నారు. యాచకు లీ మహారాజును కర్ణు డన్నారు. పరరాజు లీ మహారాజును ధర్మరాజన్నారు. ప్రజలందరూ ఈ మహారాజును భగవంతుడన్నారు.

ఈ మహారాజుగారి అసలుపేరు శ్రీ భావరాజుగారు. గద్దెఎక్కి కొద్ది సంవత్సరములే అయినప్పటికీ ప్రజానురాగముగలిగి ప్రజాహిత కార్యముల చేస్తూవుండేవాడు.

సమీప రాజ్యములోనున్న ప్రజలు కాటకములచేత మూడు సంవత్సరములబట్టి బాధపడుతూ వున్నారు. అతివృష్టి, అనావృష్టి కారణములుగా పంటలు పండకపోవడము ఒక కారణము. కాటకముతో పాటు అంటువ్యాధులు కూడా ప్రవేశించినవి.

ఇంక రాజ్యములో ఉండడము దుస్సాధ్యమని చెప్పి అక్కడి బ్రాహ్మణులు కొందరు మూటా ముల్లే కట్టుకొని, భూములూ యిళ్ళూ వదలిపెట్టి పశువులను తోలుకొని భావరాజుగారి రాజ్యమునకు వచ్చినారు. వచ్చి మహారాజుగారి దర్శనార్థమై వెళ్లినారు.

"మహారాజా! మా రాజ్యములో కాటకములవల్లా, వ్యాధులవల్లా నిలువ నీడలేక మీ అండ చేరుతున్నాము. తృణకాష్ఠ జలసమృద్ధిగల మీ రాజ్యములో మాకు తలదాచుకోవడానికి చోటు దయచేయించాలి" అన్నారు.

ఆ మహారాజుగారు మాబాగన్నారు. ఫలవంతమైన భూముల మధ్య గృహములు నిర్మించి ఆ గృహములలో యీ బ్రాహ్మణులను కాపురముండమన్నారు భావరాజుగారు. ఒక్కొక్క కుటుంబమునకు సరిపోయే గ్రాసము నీయగల భూములను వారి వారికి పంచిపెట్టి వాటిపై పన్నులను స్వల్పముగా విధించినారు.

మహారాజుగారిపై కృతజ్ఞతకొద్దీ ఆ బ్రాహ్మణులందరూ ఆ అగ్రహారమునకు భావాపురమని పేరు పెట్టినారు. కొన్ని సంవత్సరాలు ఈ మోస్తరుగా జరిగినవి. బ్రాహ్మణులందరూ కలిసి మహారాజుగారి దర్శనార్థమై వెళ్ళినారు.

"ఏమివచ్చారు భూదేవులు" అన్నారు మహారాజుగారు.

"మహాప్రభో ! చతుర్వర్ణములవారూ లేకపోవడంవల్ల మా భావాపురం, లోపసహితముగా వుండుకుంటున్నది. అన్ని వృత్తులవారూ మా అగ్రహారమున లేకపోతే మేముమాత్రం బ్రతకడం ఎలాగ" అన్నారు.

మహారాజుగారు 'సరే' అన్నారు. భావాపురము కొంతకాలమునకు అన్ని జాతుల వారికీ ఆకరమై సిరిసంపదలతో తులతూగుతూ వున్నది. మరికొన్ని సంవత్సరములు జరిగినవి. భావాపురవాసులందరూ కలిసి మళ్ళీ మహారాజుగారి దర్శనార్థమై వెళ్లినారు. "ఇప్పుడేమి ?" అన్నారు మహారాజుగారు.

"మహారాజా ! పంటలవల్ల గ్రాసము సరిపోవుచున్నది. తాగుటకు కావలసినన్ని నీళ్ళు కలవు. మా పశువులకు గడ్డిలోపము లేదు. మీ రాజ్యములో పండేపంటలూ, కూరగాయలూ, మీ రాజ్యములోని మంచి మంచి పశువులూ, ఇతర గ్రామములలో మంచి మంచి పనివాండ్రు తయారుచేసిన వస్తువులూ మాకు లభించడం ఎట్లాగ ! మేము దూర దేశములు వెళ్లగలమా మహారాజా ?" అన్నారు పురవాసులు.

"అయితే ఏమీకావా"లన్నారు మహారాజుగారు.

"ఒక వారము మావూళ్లో సంత జరిపేటట్టు ఉత్తరుః పాలించాలి ప్రభువువారు" అన్నారు ప్రజలు.

"సరే" అన్నారు మహారాజుగారు. ఇతర గ్రామముల నుంచి వచ్చిన సరుకులు తాముకొంటూ తమ గ్రామములలోనివి యితర గ్రామములవారికి అమ్ముతూ సంతుష్టిగా కాలము గడుపుతున్నారు భావాపుర వాసులు. మరికొన్ని సంవత్సరములు జరిగినవి. ప్రజలందరూ కలిసి మహారాజుగారి దర్శనార్థమై వెళ్లినారు మళ్లీని.

"ఎందుకు వచ్చేరు" అన్నారు మహారాజుగారు.

"ప్రభువులవారు మా విన్నపం పాలించాలి. మా గ్రామములో వెలసిన శ్రీ కృష్ణస్వామికి దేవాలయం నిర్మించుకొని చాలాకాలమైనది. దేశదేశములవారూ మా కృష్ణస్వామిని కొలిచి ఇష్టసిద్ధులు పొందవలెనని మేము అశిస్తున్నాము" అన్నారు ప్రజలు. "ఏమిచేయమన్నారు" అన్నారు మహారాజుగారు. "తమ రాజ్యములోవారూ ఇతర రాజ్యములోవారూ తమతమ రాజ్యములలో ప్రసిద్ధికెక్కిన పనివాళ్లు తయారుచేసిన రకరకముల సామానులతో మాఊళ్లో దుకాణములు పెట్టవలెను. అందరూ మా కృష్ణస్వామిని కొలువవలెను. అందుకోసం మా భావాపురములో ఏడాదికొకమారు తిరునాళ్ళు జరిగేటందుకు ఉత్తరువు దయచేయించాలి. ఇంతే మా మనవి" అన్నారు.

"సరే" అన్నారు మహారాజువారు. ప్రతియేడూ నేర్పరులైన శిల్పులు తయారుచేసిన లోహ విగ్రహములు, శిలా విగ్రహములు, కర్ర సామానులు, యింకా యితర వస్తువులు చుట్టుపట్ల రాజ్యములలోని ప్రజలుతేగా భావాపురం కలకలలాడుతూ వుండేది. అనేక విద్యలలో ప్రవీణులైనవారు వచ్చి తమ విద్యలను ప్రదర్శించేవారు. కాడి పట్టులూ, గుండ్లెత్తడాలు, మొదలైన బలమును సూచించేపనులు చేసేవారు చాలా మంది. వీటితోపాటు అశ్వజవ పరీక్షలూ, వృషభబల పరీక్షలూ కూడా జరుగుతూ వుండేవి. ఇవిగాక పురాణకాలక్షేపాలూ, హరికథలూ, వీధి భాగవతాలూ, యక్షగానాలూ, తోలుబొమ్మలాటలూ మొదలైనవి ప్రజలకు సంతోషాన్ని కల్పించేవి.

అన్నిటికన్నా గొప్పవిషయం ఏమంటే శ్రీకృష్ణస్వామి మహత్తు దేశదేశములా వ్యాపించింది.

భావాపురం తిరునాళ్ళు చాలా ప్రసిద్ధికెక్కింది.

ఈ రీతిగా చాలా సంవత్సరములు జరిగినవి.

భావాపురవాసులందరూ ఏవిధమైన లోటూ లేకుండా తమ ఏలిక వంటి ధర్మప్రభువులు యిదివరకు పుట్టలేదనీ, యిక పుట్టబోరనీ దృఢ విశ్వాసముగలవారై కాలమును పుచ్చినారు.

శ్రీశ్రీ భావరాజుగారు కొన్నేళ్లకు కీర్తిశేషులైనారు.

చాలాకాలమువరకూ ఆ రాజ్యమును వారి వంశస్థులు పరిపాలన చేసినారు. కొన్ని తరములైన తరువాత ఆ రాజ్యము యీ వంశస్థుల చేతినుండి వేరొకరి వశమైనది.

భావరాజుగారి వంశమువారు రాజ్యచ్యుతులైనప్పటికీ భావరాజు గారి కీర్తి భావాపురములో స్థిరస్థాయియై వున్నదిగదా అని వారి వంశ స్థులూ సంతోషించేవారు. కొన్ని వందల సంవత్సరములు గడచినవి.

రాజ్యముల సరిహద్దులు మారినవి. స్వదేశరాజుల పరిపాలనము అంతరించింది దూరదేశముల నుంచి భిన్న వేషభాషలుగల కొత్తవారు వచ్చి యీ రాజ్యములను ఆక్రమించి ఏలడము ప్రారంభించినారు. రాజ్యములలో, అనుకోని మార్పులు అనేకములు సంభవించినవి

భావాపురంలోని ప్రజలలో వేషభాషల్లో మార్పులు పుట్టినవి. రాజుల్నిబట్టి ప్రజలు మారడము సామాన్యంగా సహజం.

వేషభాషలతోబాటు వారి వృత్తులుకూడా మారిపోయినవి. మనః ప్రవృత్తులు మారినవి. ఈ క్రొత్త సంప్రదాయాల స్వీకరించిన యువకు లందరూ కలిసి ఒకనాడు గ్రామస్థుల సభ చేయించారు. అందులో ముఖ్య ముగా రాజవిద్యనభ్యసించినవారే యీ సభ నలంకరించారు.

అసలు సభ చెయ్యడానికి కారణం ఏమిటీ అంటే—ఆ చుట్టుపట్ల గ్రామముల నేలుతూన్న ప్రతినిధి స్తోత్రప్రియుడు. తానీదేశమున కొద్ది కాలమే ఉండువాడనే సంగతి గ్రహించి ఆ స్వల్పకాలములో తనకీర్తిని

ఆ ప్రాంతముల నెలకొల్పవలెననే అపేక్షతో వున్నాడు. స్తోత్రప్రియుడికి స్తోత్రపాఠకులు దొరకడం ఏమికష్టము? అందులో అయన సర్వాధికారియై వున్నప్పుడు. భావాపుర యువకులు పెక్కురు ఆయన నాశ్రయించినారు. ఆయన తన మనోభీష్టమును వీరికి వెల్లడిచెయ్యగా "అదెంతపని" అన్నారు వీరు.

"అయ్యా! మీరా భావాపురము ననుసరించియున్న భూములను కొన్ని నివేశస్థలములుగా ప్రజలకు యిప్పించాలి. దానికోసమై మీరు స్వల్పముగా మాత్రము దరఖాస్తు సొమ్ము పుచ్చుకోవాలి" అన్నారు.

"అయితే భూమికోసం దరఖాస్తులు పెట్టించండి" అన్నాడాయన.

యువకులు, అందరిచేతా, స్వల్పమూల్యమునకు వస్తున్నాయని, నివేశస్థలములకోసము దరఖాస్తులు పెట్టించినారు. భావాపురము ననుసరించి కొద్దికాలములో ఒకపేట ఏర్పాటు కాబడ్డది. ఆ పేటకు ప్రాముఖ్యము కలగడానికి ఆ అధికారి తన అఫీసుల నక్కడనే కట్టించుకున్నాడు. యువకులందరూ కలసి ఆ పేటకు ఆ అధికారి పేరుపెట్టి తీరాలి అన్నారు.

ఆ పేటనందరూ కూపతుపేట అని పేర్కొన మొదలుపెట్టినారు.

కొన్ని సంవత్సరములు జరిగినవి.

"మీపేరు మావూళ్లో శాశ్వతముగా వుంటుందిగాదా. ఇంకెందుకు మీకు విచారం" అన్నారు యువకులు, అధికారిని చూచి. "పేటకు అంత ప్రాముఖ్యములేదు. ఊరిపేరు దేశదేశములా తెలుస్తుంది. పేటపేరు చుట్టుపక్కల మాత్రమే చెప్పుకుంటారు" అన్నాడు అధికారి.

"చిత్తము. అలాగే చేయిస్తాము" అన్నారు యువకులు. "మేలు మరువను సుమండీ" అన్నాడు అధికారి.

భావాపురవాసుల సభ కరతాళధ్వనులతో, బాగుగా జరిగినది. అగ్రాసనాధిపతి సభను జరిపించాడు. యువకులు కొందరు ఉపన్యాసములిచ్చారు.

"అగ్రాసనాధిపా,! సభ్యసోదరులారా. ఈనాడు మనమిక్కడ సమావేశమైన సంగతి మీకందరకు దెలిసినదే. న్యాయతీర్పరియు,

ధర్మమూర్తియునగు మన యధికారి కూపరుగారి యెడల, మనము జూపవలసిన కృతజ్ఞత క్రియాపూర్వకముగా నుండవలెనని నేను మెండుగ నుపపాదించుచున్నాడ. అయ్యధికారి గుణములప్పట్టి. వన్నెపెట్టిన కుందనము. త్రుప్పుపట్టిన యినుముగాడు. ఈయన పేర మనమీపురమును పిలిచినట్లైన మనకు అనేకవిధములగు లాభములున్నవి. ఆయన యెడల మనము కృతజ్ఞత చూపినవారమగుదుము. మనయూరి ప్రస్తుత నామంబు చాల ప్రాతపడియున్నది. ఆపేరు మార్చనిచో మన యూరి వారందరు పూర్వాచారపరాయణులనియు, మూఢ విశ్వాసము కలవారనియు పాలకు లూహింతురు. కాబట్టి మన యూరికి కూపరుపురమను నామధేయ ముంచవలెనని నేను మీ సమ్మతి కోరినాను. నేను నుడివిన తెఱంగున మీరలాచరించిన నేనమందానందకందళితహృదయారవిందుడ నగుదును. అప్పుడే మనము కూపరుగారియెడల కృతఘ్నులము కాలేదని ప్రపంచమునకు ముక్తకంఠములో నొక్కి వక్కాణించినవారమగుదుము" యువకులందరూ కరతాళధ్వనునుచేసి తమ సమ్మతిని తెలిపిరి. ఒక మూలనుంచి ఒక ముసలివాడు లేచి "అయ్యలారా! మాపెద్దలు చెప్పగా విన్నాను. ఏ మహారాజో మన పెద్దలకు ఉపకారం చెయ్యడంవల్ల మన పెద్దలీపురమునకు భావాపురమనే పేరు పెట్టినారట. నేను ముసలివాడిని. నామాటలు మీకు వినిపిస్తున్నాయో లేదో, పేరు మార్చడం దోషం. దోషం. తరవాత మీచిత్తం."

యువకులందరూ గోలచేసినారు. అగ్రాసనాధిపతిగారు నోట్సు తీసుకున్నారు.

పురమునకు కొత్తపేరు వుంచవలెనని తేలింది. అల్పాహారములతో సభ ముగిసింది.

సభాతీర్మానములు దొరగారికి తెలియచేశారు. గ్రామ రికార్డులలో యిప్పటినుంచి కొత్తపేరే వాడుతూ వుండవలసినదిగా వారు ఉత్తరువు చేసినారు. అనాటి నుంచీ భావాపుర మనేపేరు అంతరించిపోయినద. కూపరుపురమనేపేరు వ్యవహారములోనికి వచ్చినది.

సంవత్సరాది సమీపిస్తూవున్నది. యువకులందరూ అధికారితో ఎక్కువ చనువుగా వుంటున్నారు. అధికారి వీరివంటివారు లేరని స్నేహితులతోటీ పై అధికారులతోటీ చెప్పినాడు. వీరిని గురించి పెద్ద పెద్ద వుత్తరములు వ్రాసినాడు. వారందరూ ఎంతో ఆశతో కనిపెట్టుకొని వున్నారు.

సంవత్సరాది వచ్చినది. బోలెడంత డబ్బు ఖర్చుపెట్టి అధికారిని యువకులు గౌరవించినారా రోజున. సంవత్సరాదిపట్టిక వచ్చినది. దేశములోని ప్రముఖులగు వారందరికీ అందు బిరుదులిచ్చినారు. కూపరు పురములోని యువకులపేళ్ళు మూడు ఆ పట్టికలో వున్నాయి.

ఒకరికి "రావు" అను బిరుదు వచ్చినది.

రెండవవారికి "దివాను" అను బిరుదు వచ్చినది.

మూడవవారికి "సాహేబు" అను బిరుదు వచ్చినది.

యువకులు ముగ్గురూ గ్రామమంతా స్వంతఖర్చులతో వూరేగినారు. ఈ అధికారివంటి ప్రభువు యింతకు ముందు పుట్టలేదు. యింక ముందు పుట్టబోడని వుపన్యసించినారు. కొంతకాలము గడిచింది.

కూపరుపురం ప్రజల నోళ్లలోపడి క్రమక్రమంగా నలిగిపోయింది. నేడు దానికి కుప్పాపురం అనే పేరు స్థిరపడింది. నేటి కవులు తమ గ్రంథాల్లో దీనిని రాశీపుటభేదనమని వర్ణిస్తూ వస్తున్నారు.

—:o:—